నేటి నుంచి సమ్మక్క, సారలమ్మ జాతర


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని మానసాహిల్స్‌లోని గుట్టపై వెలసిన సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర నేపథ్యంలో గుట్టను అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే సమ్మక్క, సారలమ్మ గద్దెలను అందంగా తీర్చిదిద్దారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేశారు. జాతరకు హాజరుకావాలని కోరుతూ స్థానిక శాసన సభ్యులు ప్రకాష్‌గౌడ్‌ను ఆహ్వానించారు.

అవగాహన ఒప్పందం



శంషాబాద్: విమానయాన రంగంలోని కీలక విభాగాల్లో ప్రత్యేక శిక్షణ, వృత్తి విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను పరిష్కరించే లక్ష్యంతో శంషాబాద్ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్, జీఎంఆర్ ఏరో అకాడమీ రాయల్ మెల్‌బోర్న్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వైమానిక రంగంలో భవిష్యత్తు అవసరాలకు ఈ ఒప్పందం ఒక మైలు రాయి అని జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్ అన్నారు. పెరుగుతున్న పోటీకి అనుగుణంగా అత్యంత నైపుణ్యం గల నిపుణుల కొరతను తీర్చడానికి కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. కొత్త ప్రోగ్రాంల రూపకల్పనకు తమ ఎంఓయూ దోహదం చేస్తుందని మెల్‌బోర్న్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ లీ విసిక్ అన్నారు.

అర్హులందరూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి



అత్తాపూర్: రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మీసేవా కేంద్రాల నిర్వాహకులు సహకారం అందించాలని ఎమ్మెల్సీ మీర్జా రహమద్ బేగ్, సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నవాజుద్దీన్ అన్నారు. మంగళవారం వారు మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం


ఆర్థిక సహాయం అందజేస్తున్న నగేష్‌యాదవ్

మణికొండ: ఉరుకుల పరుగుల జీవితంలో మనుషులకు ప్రశాంతత, మానసిక తృప్తిని ప్రసాదించేందుకు దేవాలయాలను నిర్మించాల్సిన అవసరం ఉందని వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కిస్మత్‌పూర్‌లో నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయానికి రూ.15.1లక్షల విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలు, కాలనీల్లో వీలైనన్ని దేవాలయాలను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో కిస్మత్‌పూర్ నాయకుడు సదానంద్, దేవాలయ నిర్మాణ కర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక కాముని చెరువు వెనక గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గీతల చొక్కా, నల్లని ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు రిజర్వాయర్లతోనే

నీటి సమస్యకు పరిష్కారం

మణికొండ: వేసవికాలం రాకముందే బోర్లు వట్టిపోయి ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేసేందుకు మరిన్ని రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని మణికొండ బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే నెమలినగర్, గోల్కొండ హిల్స్‌లలో రిజర్వాయర్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించారన్నారు. వాటితో పాటు మణికొండ గ్రామానికి అవసరమైన నీటి కోసం మరో రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. డ్యామ్‌ల నుంచి ఒక రోజు నీటి సరఫరా నిలిచిపోయినా స్థానికంగా ఉన్న రిజర్వాయర్ల నుంచి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్యాంకర్ల సరఫరాను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో గంటపాటు సరఫరా అయ్యే నీటిని ఇపుడు 40 నిముషాలకు తగ్గించడం దారుణమన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొందరు నీటి కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా సాంకేతిక కారణాలతో మంజూరు చేయడం లేదని, వారికి తాత్కాలిక క్యాన్ నెంబర్లు కేటాయించాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీలకు మెయిన్ పైప్‌ల నుంచి కాకుండా సరఫరా లైన్ల నుంచి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్ర నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీకాంత్, జి.విఠల్, షేక్ ఆరీఫ్, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ మల్లేష్‌రాజ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మైకెల్‌కాలనీ, వినాయక్‌నగర్, డీడీ కాలనీ, కాశీమందిర్, ఎస్ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయనగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జీఆర్‌నగర్, మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్, బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఆరెమైసమ్మ మెయిన్ రోడ్డు, కాశీకానగర్, ఎస్ఎఫ్‌సీ కాలనీ, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్, రోడ్ నెంబర్1,5, న్యూ కేర్ ఆసుపత్రి, గాయత్రీనగర్, వికాస్‌నగర్, ద్వారకానగర్, యాదవమిత్ర కాలనీ, షిర్డిసాయి బాబా కాలనీ, ప్రశాంత్‌కాలనీ, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్, భరతీనగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నీటి సమస్యను పరిష్కరించండి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, గంధంగూడ పరిధిలోని పలు కాలనీల వాసులు నీటి ఎద్దడి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న ఇండస్ వ్యాలీ, సాయి బాలాజీనగర్, తిరుమల హిల్స్ కాలనీ, యాదయ్యనగర్ కాలనీ, కేకేనగర్-1, శాంతి ఎస్టేట్స్ కాలనీలు గత పదేళ్లుగా నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నాయన్నారు. డంపింగ్ యార్డు కారణంగా భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, దీంతో ఆయా కాలనీల ప్రజలు నల్లా నీటిపైనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. వారం రోజులకు ఒకసారి కూడా నీరు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మేనేజర్ స్పందిస్తూ ఈ నెల 20లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 22న ఆల్ కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు చౌరస్తాలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ పీసరి వినయ్‌రెడ్డి, తిరుమల హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, ఇండస్ వ్యాలీ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, యాదయ్యనగర్ ప్రెసిడెంట్ నరసింహ, సాయి బాలాజీనగర్ ప్రెసిడెంట్ స్వరూప్‌రెడ్డి, రవి,శాంతి ఎస్టేట్స్ ప్రెసిడెంట్ రమణ, కేకేనగర్ నుంచి లుకమన్, వైజీఎస్ రెడ్డి, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. గత నవంబర్‌లో మానాలిలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగిన నేషనల్ సర్వీస్ స్కీమ్-నేషనల్ అడ్వెంచర్ క్యాంప్‌లో వర్సిటీ పరిధిలోని ఎనిమిది కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కార పత్రాలను అందజేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాలరెడ్డి, సైఫాబాద్ కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీపల్లా పాల్గొన్నారు.

9 శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తున్నా

శంషాబాద్: మాదిగల 8 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు గుంటి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ సాధనకు అమరులైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. మూడు దశాబ్దాలుగా జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ముగిసిందన్నారు. భవిష్యత్తులో రిజర్వేషన్లను 12 శాతానికి పెంచేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నజీరుద్దీన్, శ్రీనివాస్, శ్రీధర్, భాస్కర్, రమేష్, సురేష్, భీమ్‌రావు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిడమర్తి రవి

వ్యవసాయంపై యువత దృష్టి సారించాలి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: యువత వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా యువజన, క్రీడా సర్వీసులు శాఖ అధికారి కోటానాయక్ అన్నారు. మంగళవారం గండిగూడ శివారులోని బవాటీ అగ్రి ఫార్మ్‌లో స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఒక రోజు వ్యవసాయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ సికింద్రాబాద్ పీజీ కళాశాలలోని మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నాయక్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం వ్యవసాయ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, యువత ఇటు వైపు అడుగులు వేయాలన్నారు. సేంద్రీయ సాగు పంటలకు మార్కెట్‌లో డిమాండ్‌తో పాటు లాభదాయక ధరలు ఉన్నాయని సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ సూచించారు. పుట్టగొడుగులు, చేపలు, నాటుకోళ్ల పెంపకంతో మంచి ఉపాధి పొందవచ్చన్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఔత్సాహిక రైతులు బంకట్‌లాల్, రాజశేఖర్, లెక్చరర్ డా.శంకర్, సేవా బృందం సభ్యులు దుర్గాప్రసాద్, లక్ష్మీనర్సింహా, అజయ్, పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థం

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో రంగనాథుడి చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలోని బావి వరకు ఊరేగింపుగా వెళ్ళి చక్రతీర్థ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూర్ణాహుతి, వసంతోత్సవం, ద్వాదశ ఆరాధన, దేవతావిసర్జనం, ధ్వజారోహణం, భేరిపూజ, మూకబలి, సప్తవర్ణ పూజలు చేశారు.అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



13 నుంచి ముక్తేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: గండిపేట, గండిమైసమ్మ దేవాలయ ఆవరణలోని ముక్తేశ్వరస్వామి దేవాలయ పునః నిర్మాణంలో భాగంగా ఈనెల 13 నుంచి 15 వరకు ముక్తేశ్వరస్వామి, పార్వతీదేవి, గణపతి, నవగ్రహాలు, ఆలయ గోపుర శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్తలు మాజీ కౌన్సిలర్ విజేత ప్రశాంత్‌యాదవ్ తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా 13న గణపతిపూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం ఉంటాయన్నారు. 14న మంటప దేవతల పూజలు, సంభార హోమాలు, దిశా హోమం, గణపతి, నవగ్రహ, అష్టదిక్పాలక హోమాలు, మూలమంత్ర హోమం, క్షీరాధివాస పూజలు నిర్వహిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 15న ఉదయం 7.30గంటలకు మంటప పూజలు, అంగహోమం, కళా హోమం, మూల మంత్ర హవనము, రత్నాన్యాసము, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కలాన్యాసము, నేత్రోన్మీలనము, ధేను దర్శనము, కుంభం పోయుట, పూర్ణాహుతి, అవభృతిస్నానం, మహా దాశీర్వచనములు, శాంతి కల్యాణం ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

మణికొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 3 నుంచి 6 సంవత్సరాల వయసు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించే క్రమంలో గండిపేట మండల అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసిందని శిక్షకురాలు పద్మజ తెలిపారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని సులభతరం చేసేందుకు ఆట, పాట ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సుధారాణి, మహేశ్వరి, ఆస్మా, బిందులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


మణిదీప్-99.031


చరణ్‌తేజ్-98.295

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్‌లో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాల నుంచి 104 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 13 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్స్ సాధించగా 25 మంది విద్యార్థులు 80కిపైగా, 20 మంది విద్యార్థులు 70 పర్సెంటైల్స్‌ను సాధించారు. రంగు మణిదీప్ 99 పర్సెంటైల్‌తో కళాశాలలో మొదటిస్థానంలో నిలవగా కొమ్ము చరణ్‌తేజ్ 98.295 పర్సెంటైల్స్‌తో ద్వితీయ స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె వెంకటచలపతి ,గురుకుల సంస్థ కార్యదర్శి అలుగువర్షిని, సంయుక్త కార్యదర్శి సంతోషి, ఓఎస్‌డీ వివేకానంద, రాష్ట్ర స్థాయి అధికారి ఎం భీమయ్య అభినందించారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా సెక్రటరీ కొమురయ్య మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భారత రాజకీయ రంగంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు సులిగే వెంకటేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడం సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార్, అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, కిరణ్‌చారి, ప్రణవభక్త సమాజం అధ్యక్షులు నర్సింహ, అశోక్, మల్లారెడ్డి, జయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో..

గొప్ప జాతీయవాది, మానవతావాదానికి మార్గదర్శకుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 57వ వర్ధంతి సందర్భంగా మణికొండ మున్సిపల్ బీజేపీ పార్టీ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాళ్ దేశానికి, వెనకబడిన వర్గాలకు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు జె.సిద్ధప్ప, సి. బీరప్ప, వందన, లక్ష్మీ, ఇందిర, అనితాదేవి, ఆనందరావు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


బండ్లగూడ చౌరస్తాలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టిప్పుఖాన్ బ్రిడ్జీ నుంచి అప్పా జంక్షన్ వరకు రహదారుల ఆక్రమణల తొలగింపును రెండో రోజు మంగళవారం కొనసాగింది. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర స్వయంగా పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పా జంక్షన్ నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జి వరకు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న ప్రధాన రహదారి ఆక్రమణను తొలగించడం జరిగిందన్నారు. ఎవరైనా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే ఉపేక్షించమన్నారు. ఎప్పటికప్పుడు వాటిని గుర్తించి తొలగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్‌టీఏ దాడులు



ఆరాంఘర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

రాజేంద్రనగర్: రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కొరడా ఝులిపించారు. మంగళవారం ఆరాంఘర్ ప్రాంతంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర టాక్స్ కట్టకుండా చెలామణి అవుతున్న ప్రైవేటు ట్రావెల్స్ మాఫియాపై నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 10 ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి యార్డుకు తరలించినట్లు తెలిపారు. తెలంగాణ బార్డర్‌లో అధికారుల కళ్లుగప్పి నగరానికి వచ్చిన సుగుణ ట్రావెల్స్, ఎస్ఆర్టీ ట్రావెల్స్, వినాయక ట్రావెల్స్, సాయి దుర్గా ట్రావెల్స్, ఈస్ట్ వెస్ట్ ట్రావెల్స్, అనంత ట్రావెల్స్‌కు చెందిన బస్సులను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు.

వైభవంగా సమతాకుంభ్ ఉత్సవాలు



శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతాకుంభ్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సుప్రభాత గోష్టితో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో రామానుజ విజ్ఞాన వేదికలో కళాశాల, పాఠశాల విద్యార్థులు ధ్యానం, అష్టాక్షరీ మంత్రజపం అనుగ్రహణం చేశారు. భగవద్రామానుజుల క్విజ్ పోటీలు, చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 18 దివ్య దేశ మూర్తులకు గరుడ సేవలు, సామూహిక తిరుమంజన సేవ నిర్వహించారు.అనంతరం ఉత్సవమూర్తులను మాడ వీధుల గుండా యాగశాలకు వరకు ఊరేగింపు నిర్వహించారు. చంద్రప్రభ వాహనంపై దివ్యసాకేత రామచంద్రుడు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.